సాక్షి జగిత్యాల

ఆదివారం । 15 । సెప్టెంబర్ । 2024



పక్కాగా పాఠశాలల సమాచారం

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల సమగ్ర సమాచారం ఇక పక్కాగా లభించ నుంది. 8లో▸



ఎన్నికల్లో మద్దతు ఇవ్వండి

కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి కోరారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0/25.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది. సాయంత్రం చలిగాలులు కొనసాగే అవకాశం ఉంది.

బిట్ కాయిన్ హవాలా!

- ముగింపు దశకు దందా
- కేసులు నమోదవుతుండటంతో బిచాణా ఎత్తేసే పనిలో కింగ్‌పిన్
- మల్టీ లెవల్ మార్కెటింగ్ సిస్టమ్ ద్వారా రూ.కోట్లు వసూలు
- హవాలా రూపంలో విదేశాలకు తరలింపు
- వ్యాపారం విలువ కరీంనగర్‌లో రూ.300 కోట్లు, జగిత్యాలలో 100 కోట్లు
- పలువురు టీచర్లు, పోలీసులు, రియల్ వ్యాపారులు , మాజీ ఎమ్మెల్యేల పెట్టుబడి



సాక్షి పరిశోధన

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

బిట్‌కాయిన్ పేరిట జరుగుతున్న హవాలా దందా ముగింపు దశకు చేరుకుంది. విదేశాల నుంచి తెలుగు రాష్ట్రాల్లో ఆపరేట్ చేస్తున్న నిర్వాహకులు చట్టపరంగా పలు ఇబ్బందుల్లో పడుతున్నారు. ఇటీవల నిర్మల్ జిల్లాలో ఈ రాకెట్ మీద కేసు నమోదైన దరిమిలా.. మిగిలిన ఏజెంట్లు ఆందోళనలో ఉన్నారు. ఒకరు చేరి మరింత మందిని చేర్పించే విధానంలో వచ్చే కమీషన్‌తో నడిచే మల్టీ లెవల్ మార్కెటింగ్(ఎంఎల్ఎం) సిస్టమ్ ద్వారా రూ.కోట్లు వసూలు చేసి, హవాలా రూపంలో విదేశాలకు పంపుతున్నారు. అధిక లాభాల ఆశతో పలువురు టీచర్లు, రెవెన్యూ, పోలీసు అధికారులు, మాజీ ఎమ్మెల్యేలు, రాజకీయ నాయకులు భారీగా పెట్టుబడులు పెట్టారు. ఈ స్కీంలో చక్రం తిప్పుతున్న ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వానికి సమాచారం ఇవ్వకుండా దేశాలు దాటుతున్న వేళ.. ఇది తీవ్ర వివాదంగా మారుతోంది. పథకం మీద నీలినీడలు కమ్ముకున్న నేపథ్యంలో ఇప్పటికే లాభాలు గడించినవారు నింపాదిగానే ఉన్నా.. ఇటీవల రూ.లక్షలు పోసి, చేరినవారు కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నారు.

దుబాయ్, మలేషియా ట్రిప్పులతో ఎర?

బిట్‌కాయిన్ పేరిట రాష్ట్రంలో జరుగుతున్న వ్యాపారం విలువ రూ.1,000 కోట్ల పైమాటే అని అంచనా. నిర్మల్‌లో రూ.50 కోట్లు, జగిత్యాలలో రూ.100 కోట్లు, కరీంనగర్‌లో రూ.300 కోట్ల వరకు ఉంటుందని దళారులు చెబుతున్నారు. గతేడాది అసెంబ్లీ ఎన్నికల సందడి మొదలైన తర్వాత రియల్ ఎస్టేట్ రంగం కాస్త నెమ్మదించింది. దీన్ని ఈ దందా చేసేవారు తమకు అనుకూలంగా మలుచుకున్నారు. రూ.5 వేల నుంచి రూ.50 లక్షల వరకు ఎంతైనా ఇందులో పెట్టుబడి పెట్టవచ్చు. ఆన్‌లైన్‌లో వీరికి ఒక యాప్ ఉంటుంది. స్థానిక నిర్వాహకులే వారికి డౌన్‌లోడ్ చేసి, ఐడీ, పాస్‌వర్డ్ ఇస్తారు. ఈ యాప్‌ను ఉపయోగించి, డాలర్లు కొనమని చెబుతారు. రూ.లక్ష పెడితే 1,000 డాలర్లతోపాటు ప్రతీ నెల రూ.12 వేలు ఖాతాలో వేస్తారు. దీనికితోడు వీరు చేర్పించిన ప్రతీ ఖాతాదారు మీద రూ.లక్షకు రూ.6 వేల చొప్పున కమీషన్ వస్తుంది. అతని కింద ఎంత మంది చేరితే అంత కమీషన్ పెరుగుతుంది. అలా కరీంనగర్, పెద్దపల్లి, నిర్మల్, జగిత్యాల జిల్లాల్లో రోజుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు కమీషన్ పొందేవారున్నారంటే అతిశయోక్తి కాదు. 50,000 డాలర్లు చేస్తే వారికి ఫైవ్ స్టార్ రేటింగ్ ఇస్తారు. దుబాయ్ ట్రిప్పులు ఉంటాయి. ఒకేసారి రూ.కోటి పెట్టుబడి పెడితే వారిని మలేషియా, సింగపూర్, బ్యాంకాక్ విహారయాత్రలకు పంపుతున్నారు. ఖాతాదారుల నుంచి పోగు చేసిన డబ్బును హవాలా రూపంలో దుబాయ్‌కి పంపిస్తున్నారు.

ప్రభుత్వ టీచర్లు, పోలీసులే ఏజెంట్లు..

కరీంనగర్‌లో ఒకప్పుడు ప్రైవేటు స్కూల్ నడిపిన ఓ ప్రముఖుడు స్థానికంగా ఈ వ్యాపారానికి గుండెకాయ. ఇతనికి కరీంనగర్, సుల్తానాబాద్‌లో ప్రధాన అనుచరులున్నారు. జార్ఖండ్‌కు చెందిన సింగ్ వ్యాపారి దుబాయ్ కేంద్రంగా బిట్‌కాయిన్ పేరుతో పేర్లు మార్చి, దాదాపు డజను యాప్‌ల ద్వారా ఈ దందా నడుపుతున్నాడు. తెలుగు రాష్ట్రాలకు విజయవాడకు చెందిన లోకేశ్ బాధ్యుడిగా ఉన్నాడని సమాచారం. ఇతని సూచనలతో కరీంనగర్‌లో ప్రభుత్వ టీచర్లు, రెవెన్యూ అధికారులు, పోలీసులకు గాలం వేశారు. తొలుత వీరికి పార్టీలు ఇచ్చి, విదేశీ టూర్లు ఆశచూపి భారీగా పెట్టుబడులు పెట్టించారు. ఉద్యోగులు తమ సహోద్యోగులు, రియల్ ఎస్టేట్ ఏజెంట్లు, ఇతరులతో పెట్టుబడులు పెట్టించారు. ఈ డబ్బును హవాలా మార్గంలో దుబాయ్‌కి పంపుతుంటారు. చాపకింద నీరులా ఇది రాష్ట్రవ్యాప్తంగా విస్తరించింది. పై ముగ్గురికి రోజుకు రూ.3 లక్షల ఆదాయం కమీషన్ రూపంలో యాప్‌లో పడుతోంది. ఇది సాగినంత సేపు బాగానే ఉంటుంది. యాప్ లో అనుకున్న టార్గెట్ చేరినా.. కొందరు తమ డబ్బును తిరిగి డ్రా చేసుకోలేకపోతున్నారు. తాజాగా పోలీసుల నిఘా పెరగడం, కేసులు నమోదవుతుండటంతో ఈ దందాను నడిపే డజను యాప్‌లలో కొన్నింటిని మెల్లిగా నిలిపివేసి, బిచాణా ఎత్తేసే పనిలో కింగ్‌పిన్ ఉన్నాడని తెలిసింది. దీన్ని ముందుగానే గ్రహించిన కరీంనగర్‌కు చెందిన సీనియర్లు తమ జాగ్రత్తలో తాము ఉన్నారని సమాచారం.

దుబాయ్‌కి హవాలా? అక్కడ నుంచి..?

రాష్ట్రంలో అందులోనూ ఉత్తర తెలంగాణ నుంచి రూ.వందల కోట్లు దుబాయ్‌కి పంపుతున్నారు. ఏజెంట్లు వసూలు చేసిన మొత్తాన్ని హవాలా దుబాయ్‌కి పంపిస్తున్నారు. అయితే, ఈ డబ్బు దుబాయ్‌లోని కింగ్‌పిన్‌కి చేరుతున్నాయి. అయితే, అక్కడ నుంచి ఎవరికి వెళ్తున్నాయి? అన్న విషయం తేల్చేందుకు నిర్మల్ పోలీసులు రంగంలోకి దిగారు. అయితే, ఆ డబ్బులు వ్యక్తిగత ఖాతాల్లోకే వెళ్తున్నాయా? లేదా ఉగ్రవాద సంస్థలకు వెళ్తున్నాయా? అన్న విషయంపై తెలంగాణ పోలీసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై లోతుగా దర్యాప్తు చేసే విషయంలో త్వరలోనే స్పష్టత రానుంది.

కింగ్‌పిన్‌ను పట్టుకుంటాం



నిర్మల్‌లో ఈ తరహా స్కాంలో దాదాపుగా రూ.50 కోట్ల వరకు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. నిందితులను అరెస్టు చేయకుండా ఉండేందుకు పెద్ద ఎత్తున ఒత్తిళ్లు వచ్చాయి. ప్రభుత్వ ఉద్యోగులు చాలామంది కేసులో ఇన్వాల్వ్ అయ్యారు. ముఖ్యంగా ప్రభుత్వ టీచర్లు అందులోనూ ఎస్జీటీలు అమాయకుల నుంచి రూ.కోట్లు వసూలు చేశారు. నిమజ్జనం అనంతరం కేసు స్పీడు పెంచుతాం. దుబాయ్‌లో ఉన్న కింగ్‌పిన్‌ను కచ్చితంగా పట్టుకుంటాం.

: జానకీ షర్మిల, ఐపీఎస్

నిర్లక్ష్యం వద్దు.. నివారణ చర్యలు ముఖ్యం

- వసుపు, వరి, మొక్కజొన్న పంటలపైనే రైతుల సమస్యలు
- 'సాక్షి ఫోన్ ఇన్'లో జిల్లా వ్యవసాయ, ఉద్యానశాఖాధికారులు



రైతుల ప్రశ్నలకు సమాధానాలు ఇస్తున్న వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు వాణి, దేవప్రసాద్

జగిత్యాలఅగ్రికల్చర్: ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలో వరి, మొక్కజొన్న, పసుపు పంటల్లో తెగుళ్లు వచ్చాయి. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తీర్చేందుకు శనివారం జిల్లా వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులతో 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహించింది. ఈ సందర్భంగా రైతులు సాగులో సమస్యలను వివరించారు. రైతులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి బి.వాణి, జిల్లా ఉద్యానశాఖాధికారి జి.దేవప్రసాద్, వ్యవసాయ శాఖ టెక్నికల్ ఏడీ ఎస్.శ్రీనివాస్, లోహియా ఆయిల్‌పాం కంపెనీ ప్రతినిధులు కె.భరత్, అన్వేశ్ సమాధానమిచ్చారు.

సాక్షి ఫోన్ ఇన్

ప్రశ్న: వరిలో సుడిదోమ ఎక్కువైంది. ఏం చేయాలి..? **– బోయిన హన్మాండ్లు, మల్లాపూర్**

జవాబు: వరి నాటేటప్పుడు కాలిబాటలు వదిలితే సుడిదోమ సమస్య ఉండదు. సుడిదోమ ఎక్కువగా ఉంటే ఇమిడా క్లోప్రిడ్ 50 గ్రాముల మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ప్రశ్న: వరి ఆకులు ఎర్రగా అవుతున్నాయి. ఏం చేయాలి..?

– తీట్ల శంకర్, భూషణ్‌రావుపేట,కథలాపూర్(మం)

జవాబు: ఆలస్యంగా వరి నాటు వేసినప్పుడు.. అధిక వర్షాలకు మొక్కలు సరిగ్గా పోషకాలను తీసుకోక ఎర్రబడుతుంది. పోషకలోప నివారణకు యూరియా, పొటాష్ ఇవ్వాలి. లేదా 19–19–19 లేదా మల్టి– కె అందించాలి.

ప్రశ్న: వరిలో జింక్ లోపం ఉంది. ఏం చేయాలి..?

– మహిపాల్ రెడ్డి, లక్ష్మీదేవిపల్లి, సారంగాపూర్(మం)

జవాబు: రెండు గ్రాముల చిల్లేట్ లేదా జింక్ సల్ఫేట్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ప్రశ్న: పసుపు దిగుబడి రావాలంటే ఏం చేయాలి..?

– నగేష్ రెడ్డి, సారంగాపూర్

జవాబు: పసుపు పంటలో వర్షపు నీటిని ఎప్పటికప్పుడు తొలగించి, ఎకరాకు 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్, 25 కిలోల వేపపిండిని కలిపి వేసుకుంటే పసుపులో దిగుబడులు పెరుగుతాయి.

ప్రశ్న: ఆయిల్‌పాంలో కొమ్మపురుగు ఎక్కువగా ఆశిస్తోంది

– తుమ్మనేని తిరుపతి, గోపులాపూర్, బుగ్గారం(మం)

జవాబు: ఈ పురుగు చెట్లకు రంధ్రం చేసి, మొగి ఎండిపోయేలా చేస్తుంది. 1.5 గ్రాముల ల్యామిడా అనే మందును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఎక్కువగా ఉంటే ఎకరాకు 2 ఫెరమాన్ ట్రాప్‌లు పెట్టాలి.

ప్రశ్న: వరిలో ఎలుకల బెడద ఎక్కువవుతుంది. ఏం చేయాలి..? **– రవి నాయక్, కథలాపూర్**

జవాబు: బ్రోమాడైలిన్ లేదా అల్యూమినియం ఫాస్ఫేట్ గుళికలను ఎలుకలు ఉన్న రంధ్రంలో ఉంచి, దాన్ని మూసివేయాలి. ఆ ప్రాంతంలోని రైతులందరూ కలిసి చేస్తే ఎక్కువగా ఉపయోగం ఉంటుంది.

ప్రశ్న: మిర్చి నారుకు దరఖాస్తు చేసినా.. ఇంకా రాలేదు..? **– వెంకటేశ్, పెంబట్ల, సారంగాపూర్(మం)**

జవాబు: ప్రభుత్వం ద్వారా అత్యధిక దిగుబడినిచ్చే రకాన్ని రైతులకు ఉచితంగా అందిస్తున్నాం. నర్సరీలకు ఆర్డర్ పెట్టి 20 రోజులవుతోంది. త్వరలో అందిస్తాం.

ప్రశ్న: నాలుగేళ్ల నుంచి మామిడి తోటల్లో కాపు రావడం లేదు..?

– రాంరెడ్డి, అలూర్, రాయికల్(మం)

జవాబు: జిల్లాలో పైపైనే భూగర్భజలాలు ఉండడంతో తోటలన్నీ తేమతో ఉంటున్నాయి. పూత ప్రారంభం కాగానే.. ఎర్ర పొటాష్‌తోపాటు వైట్ పొటాష్‌ను డ్రిప్ ద్వారా ఎకరానికి 2 కిలోల చొప్పున వేసుకోవాలి.

ప్రశ్న: రూ.2లక్షలలోపు రుణం ఉన్న మాఫీ కాలేదు..?

– కొడిమ్యాల రాజేందర్, గొర్రెపల్లి, మల్లాపూర్(మం)

జవాబు: ప్రభుత్వ నిబంధనల మేరకు రుణమాఫీ మాఫీ అయ్యింది. కొత్తగా యాప్‌ను తీసుకొచ్చాం. అందులో రేషన్ కార్డు లేని, ఒంటరి రైతుల వివరాలు అప్‌లోడ్ చేసి ప్రభుత్వానికి పంపిస్తున్నాం. అర్హులందరికీ రుణమాఫీ వస్తుంది.

ప్రశ్న: రైతుబీమా డబ్బులు ఇతరుల అకౌంట్లో పడుతున్నాయి..?

– కొత్త వెంకటి, బోర్నపల్లి, రాయికల్(మం)

జవాబు: పూర్తి విషయం కోసం సంబంధిత ఏఈఓను లేదా మండల ఏఓను కలువండి. మీ వివరాలు తీసుకుని చెక్ చేస్తాం.

ప్రశ్న: మునగలో ఎండుతెగులు వస్తోంది..

– శ్రీనివాస్ రెడ్డి, దులూర్, కథలాపూర్(మం)

జవాబు: వర్షపు నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలి. కొమ్మలను ఎప్పటికప్పుడు కత్తిరించాలి. తర్వాత, 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను లీటర్ నీటికి కలిపి మొక్క మొదట్లో పిచికారీ చేయాలి. మొక్క పైపైన కాకుండా.. వేరువ్యవస్థ, కాండం తడిచేలా పిచికారీ చేయాలి.

ప్రశ్న: వర్షాలకు 20గుంటల పొలం కొట్టుకుపోయింది. పరిహారం ఇప్పించండి..

– గుండికందుల వెంకటేష్, తిప్పన్నపేట, జగిత్యాల అర్బన్(మం)

జవాబు: మా సిబ్బందితో క్షేత్రస్థాయి పరిశీలన చేయిస్తాం. పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిస్తాం.

ప్రశ్న: మామిడి చెట్లు చనిపోతున్నాయి. కారణం తెలియడం లేదు..?

– నాగమణి, సారంగాపూర్

జవాబు: మామిడి మొక్కలు నాటేప్పుడు అన్ని రకాల యాజమాన్య పద్ధతులు పాటించాలి. తోటల్లో దున్నడం వంటివి చేయాలి. ఎక్కువ నీరు ఆగకుండా, భూమి లోపల మొక్క కాండాన్ని పురుగులు తినకుండా గుళికలు వేసుకోవాలి.

ప్రశ్న: పంటల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..?

జవాబు: వర్షాలతో ఏ పంటలోనైనా మొక్కవేరు వ్యవస్థ సరైన పోషకాలను తీసుకోలేదు. దీనివల్ల నీరసించిపోతుంది. తిరిగి మొక్క బలంగా తయారు కావడానికి అవసరమైన పోషకాలను అందించాలి. వరి పొట్టదశకు చేరుకున్నందున ఎకరాకు 20 కిలోల యూరియా, 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అందించాలి.

న్యూస్‌రీల్

ఆలయాల్లో భక్తుల రద్దీ



దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ ధాలయాల్లో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా గోదావరిలో స్నానాలు ఆచరించి అనంతరం స్వామివార్లను దర్శించుకున్నారు.

కొండగట్టు అంజన్నకు అగ్గిపెట్టెలో ఇమిడే శాలువా



శాలువా బహూకరిస్తున్న విజయ్ కుమార్

కరీంనగర్: కొండగట్టు అంజన్నకు అగ్గిపెట్టెలో ఇమిడే పట్టు శాలువాను రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన చేనేత కార్మికుడు నల్ల విజయకుమార్ కుటుంబ సమేతంగా అందించారు. ముందుగా అంజన్నను దర్శించుకున్న ఆయన.. తాను సొంతంగా మగ్గంపై నేసిన పట్టు శాలువాను స్వామివారికి సమర్పించారు. ఆలయ అర్చకులు విజయ్‌కుమార్ కుటుంబానికి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ హరిహరనాథ్, ధర్మేందర్ ఉన్నారు.

విషజ్వరాలు తగ్గాలని హోమం



వినాయకుని వద్ద హోమంలో పాల్గొన్న భక్తులు

మెట్‌పల్లిరూరల్: విషజ్వరాలు తగ్గాలని కోరుతూ మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో భరత్ నగర్ యువసేన ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో జ్వరాల బారిన పడిన వారి ఆరోగ్యం కుదుటపడడంలేదని, వారు కోలుకోవాలని వినాయకుని వద్ద హోమం నిర్వహించారు. ముందుగా కుంకుమ పూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు గంగాధర్,సభ్యులు సతీశ్, రాకేశ్, భక్తులు పాల్గొన్నారు.

కులగణనతోనే బీసీలకు న్యాయం



మాట్లాడుతున్న తుల ఉమ

కథలాపూర్: బీసీల కులగణన పూర్తయ్యాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, అప్పుడే బీసీలకు న్యాయం జరుగుతుందని ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ అన్నారు. శనివారం కథలాపూర్ మండలం కలిగోటలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణన చేపడుతామని ఎందుకు జాప్యం చేస్తోందని ప్రశ్నించారు. రాష్ట్రంలో 61 శాతం బీసీ జనాభా ఉందని, చట్టసభల్లో సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం కుల గణన ప్రక్రియను త్వరగా ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కుల గణన పూర్తయితే జనాభా ప్రాతిపాదికన బీసీలకు సీట్లు పెరుగుతాయని, అన్ని రాజకీయపార్టీలు సమష్టిగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సూచించారు. ఆమె వెంట నాయకులు ఎండీ.ఎక్బాల్, శ్రీరాముల ప్రకాశ్ ఉన్నారు.

నృసింహుడిని దర్శించుకున్న అడిషనల్ కలెక్టర్ దంపతులు



ఆశీర్వచనాలు ఇస్తున్న అర్చకులు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామిని శనివారం మంచిర్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ మోతిలాల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ పక్షాన వారికి స్వాగతం పలికారు. ప్రధాన ఆలయం, అనుబంధ ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ ఈవో శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రం కప్పి చిత్రపటం, ప్రసాదాలు అందించారు. వేదపండితులు, దేవస్థానం అర్చకులు, సిబ్బంది తదితరులున్నారు.

బీర్‌పూర్ లక్ష్మీనృసింహుని సన్నిధిలో..

సారంగాపూర్: అనంతరం ఆయన బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలకు శాఖల కేటాయింపు ఎప్పుడో..?

- ఐదు శాఖలకే కేటాయింపు
- వెల్లువెత్తుతున్న ఆరోపణలు

జగిత్యాల: జిల్లాలో ఇటీవల చేపట్టిన ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ఎంపికలో అవినీతి, అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ శాఖలలో ఔట్‌సోర్సింగ్ కింద సిబ్బంది నియామకాలకు ఏజెన్సీల ఎంపిక చేపట్టారు. జిల్లాలోని వివిధ శాఖల్లో 680 మంది సిబ్బందిని నియమించుకునే అవకాశం ఏజెన్సీలకు ఉంది. ఈ మేరకు జూలై 24న టెండర్ నోటిఫికేషన్ విడుదలైంది. వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అధికారులు అదే నెల 27న 16 ఏజెన్సీలను ఎంపిక చేశారు. అయితే వీటికి శాఖలను కేటాయించాల్సి ఉంటుంది. ఇందులోనే అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఐదు ఏజెన్సీలకే శాఖల కేటాయింపు

నిబంధనల ప్రకారం జిల్లా అధికారులు ఎంపిక చేసిన 16 ఏజెన్సీలకు వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన సిబ్బందిని నియమించే అవకాశం ఉంది. ఈ బాధ్యతలను కేవలం ఐదు ఏజెన్సీలకే కేటాయించారు. మరో 11 ఏజెన్సీలకు శాఖలు కేటాయించలేదు. త్వరలోనే కేటాయిస్తామని ఉపాధి కల్పన శాఖ అధికారులు పేర్కొంటున్నప్పటికీ మిగతా వారు తమకూ కేటాయించాలని ఒత్తిడి తెస్తున్నారు. నిబంధనల ప్రకారం ఎంపిక చేయబడిన ఏజెన్సీలకు వివిధ శాఖలు కేటాయించాలంటున్నాయి. జిల్లాలో ఇటీవలే మెడికల్ కళాశాల ఏర్పాటు కావడం, ఇతర ముఖ్యమైన శాఖలు కావడంతో పాత విధానంలో కొనసాగిన కొందరు ఏజెన్సీ నిర్వాహకులు తమకే శాఖలు కేటాయించాలని కోరినట్లు తెలిసింది. నిబంధనల ప్రకారం అందరికీ ఇవ్వాల్సి ఉంటుంది. కానీ.. వారికే ఇవ్వడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మిగతా ఏజెన్సీల వారు వెంటనే తమకూ శాఖలను కేటాయించాలని పేర్కొంటున్నారు.

త్వరలోనే కేటాయిస్తాం

నిబంధనల ప్రకారం ఏజెన్సీలకు త్వరలోనే శాఖలు కేటాయిస్తాం. ఇందులో అవకతవకలు లేవు. ప్రస్తుతం నూతనంగా వచ్చే పోస్టులను ఆ శాఖలకే కేటాయిస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే కేటాయించాం.

– సత్తమ్మ, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి

అంజన్న సన్నిధిలో భక్తుల రద్దీ



స్వామికి నమస్కరిస్తున్న భక్తులు

కరీంనగర్: జగిత్యాల జిల్లా కొండగట్టు అంజన్న ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో స్వామికి నమస్కరించుకున్నారు. అలాగే అభిషేకాలు చేసుకొని తమలపాకు ,టెంకాయ మొక్కులు తీర్చుకున్నారు.భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు హరిహరనాథ్, ఉమామహేశ్వర్, చంద్రశేఖర్ సిబ్బంది అందుబాటులో ఉండి సేవలనుంచారు.

పెద్దపల్లికి సోలార్ వెలుగులు

- కాచాపూర్‌లో పైలెట్ ప్రాజెక్టుగా సౌరశక్తి ప్లాంట్
- పత్తిపాక రిజర్వాయర్, మానేరుపై వంతెన నిర్మిస్తాం
- పెద్దపల్లిలో బైపాస్ రహదారి మంజూరు చేస్తాం
- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- పెద్దపల్లి, ధర్మపురి నియోజకవర్గాల్లో విస్తృత పర్యటన

సాక్షి, పెద్దపల్లి/ధర్మారం/పెద్దపల్లిరూరల్: సోలార్ వెలుగులతో జిల్లాకు మహర్దశ పట్టించేలా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వరాలజల్లు కురిపించారు. ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ధర్మారం, పెద్దపల్లి మండలాల్లో శనివారం ఆయన విద్యుత్ సబ్‌స్టేషన్లు, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ధర్మారం, వెల్గటూరు, గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీల నూతన పాలకవర్గాలతో పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. భట్టి మాట్లాడుతూ.. హామీ మేరకు పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించామన్నారు. పాలకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు సైతం త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఎల్లంపల్లి ఎత్తిపోతలకు అవసరమైన విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. పెద్దపల్లిలో బైపాస్ రోడ్డు, ఓదెల మండలంలో మానేరుపై వంతెన నిర్మాణాలు చేపట్టి సకాలంలో పూర్తిచేస్తామన్నారు. ఇందిరా మహిళా శక్తి ద్వారా వచ్చే ఐదేళ్లలో మహిళలకు రూ.లక్ష కోట్ల వడ్డీలేని రుణాలు అందిస్తామని హామీ ఇచ్చారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసే ప్రతిపాదనలు పరిశీలిస్తున్నామని అన్నారు. జూలపల్లి మండలం కాచాపూర్ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, 12 ఎకరాల్లో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ శ్రీహర్షను ఆదేశించారు. పంటలతోపాటు పవర్‌తో కూడా కొంత ఆదాయం వచ్చేలా.. రైతులు ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఇందుకోసం ధర్మారం మండలం నందిమేడారం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేస్తున్నామని ప్రకటించారు. రూ.10వేల కోట్ల పెట్టుబడితో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో రామగుండం థర్మల్ పవర్ ప్లాంట్ స్థాపిస్తామని అన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో 25 ఎకరాల విస్తీర్ణంలో సమీకృత గురుకుల భవన నిర్మాణాన్ని మంజూరు చేస్తామని వెల్లడించారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.



రాఘవాపూర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

జిల్లాలో ఆయకట్టు స్థిరీకరణ కోసం పత్తిపాక రిజర్వాయర్‌కు ప్రస్తుత బడ్జెట్‌లో నిధులు కేటాయించామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఓదెల మానేరుపై వంతెన, పెద్దపల్లి, సుల్తానాబాద్‌లో బైపాస్‌ల నిర్మాణానికి సీఎం ఆమోదం తెలిపారని అన్నారు.

పాలిటెక్నిక్ ఏర్పాటు చేయండి

ఎల్లంపల్లి నిర్వాసతుల సమస్య పరిష్కారం కోసం చెగ్యాంలో 126 ఇళ్లు కోల్పోయిన వారికి రూ.18 కోట్లు మంజూరు చేశామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. బొమ్మిరెడ్డిపల్లి వద్ద కొత్తపల్లి కాల్వ పెండింగ్ పనులకు మరో రూ.7 కోట్లు అవసరమని, ఇది పూర్తయితే దాదాపు 10వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందని, తెలిపారు. ధర్మారం మండలంలో ఐటీఐ లేదా పాలిటెక్నిక్ మంజూరు చేయాలని ఆయన మంత్రులకు విజ్ఞప్తి చేశారు.

ఐటీ టవర్ పూర్తిచేయండి

పెద్దపల్లికి బైపాస్ రోడ్డు, ఆర్టీసీ బస్సు డిపో మంజూరు చేయాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మంత్రులను కోరారు. పెద్దపల్లి – జమ్మికుంట – పొత్కపల్లి మధ్య రోడ్డు నిర్మిస్తే 14 కి.మీ. దూర భారం తగ్గుతుందన్నారు. సుల్తానాబాద్‌కు మంజూరు చేసిన ఐటీ టవర్ నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలని, ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు ప్రతిపాదనలు పరిశీలించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

సీఎంను కలిసిన జగిత్యాల ఎమ్మెల్యే



ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, చైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాల: సీఎం రేవంత్‌రెడ్డిని శనివారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, మాజీ చైర్మన్ గిరి నాగభూషణం కలిశారు. జగిత్యాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందించారు. పట్టణం విస్తరిస్తోందని, మరింత అభివృద్ధికి సహకరించాలని కోరారు. వారివెంట లక్ష్మణ్ ఉన్నారు. అనంతరం ఎమ్మెల్యే బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిశారు. గల్ఫ్ వలసల నివారణకు నిపుణులు, అధికారులతో చర్చించారు.

మహిళా అతిథి అధ్యాపకులకు దరఖాస్తులు ఆహ్వానం

జగిత్యాల: గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం బోధించేందుకు మహిళా అతిథి అధ్యాపకులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీలత తెలిపారు. అభ్యర్థులు సబ్జెక్ట్‌లో మాస్టర్ డిగ్రీ చేసి ఉండాలని, అర్హులైన వారిని డెమో ద్వారా ఎంపిక చేస్తామని, ఆసక్తి గల వారు ఈనెల 17న నేరుగా కళాశాలకు రావాలని, వివరాలకు 86393 65500నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కుక్కల దాడిలో నలుగురికి తీవ్ర గాయాలు

మంథని: మండలంలోని వెంకటాపూర్, స్వర్ణపల్లి గ్రామాల్లో శనివారం వీధి కుక్కల దాడిలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్వర్ణపల్లిలో ఇంటిముందు ఆడుకుంటున్న చిన్నారులు మానస, వేదాన్ష్, వెంకటాపూర్‌లో గడ్డం మల్లేశ్ అతని కూతురిపై కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో వారు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను స్థానికులు మంథని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కుటుంబసభ్యులు కరీంనగర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

పక్కాగా పాఠశాలల సమాచారం

- యూడైస్ ప్లస్‌లో వివరాలు నమోదు
- నివేదిక ఆధారంగా నిధులు మంజూరు
- జిల్లాలో 1,141 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు



ఇటీవల జిల్లాకేంద్రంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మల్లాపూర్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల సమగ్ర సమాచారం ఇక పక్కాగా లభించనుంది. గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా ఉండేందుకు విద్యాశాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. పాఠశాలల్లో స్థితిగతులు, వాస్తవ పరిస్థితులు, విద్యార్థుల వివరాలను యూడైస్ ప్లస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్)లో వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. ఇందులోని వివరాలను జిల్లాస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రాష్ట్ర విద్యాశాఖకు పంపిస్తారు. అక్కడి నుంచి కేంద్రానికి నివేదికలు పంపిస్తే.. విద్యార్థుల సంఖ్యను బట్టి మౌలిక వసతులు కల్పిస్తారు.

నమోదు చేసే అంశాలు..

పాఠశాల పేరు, తరగతుల సంఖ్య, తరగతి గదుల సంఖ్య, ప్రతీ తరగతిలోని విద్యార్థుల సంఖ్య, విద్యార్థుల నేపథ్యం, బడిలో తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, వాటిలో నీటివసతి, పరిశుభ్రతకు తీసుకుంటున్న చర్యలు, సంక్రమణ వ్యాధులపై అవగాహన కలిగి ఉన్నారా..? హ్యాండ్‌వాష్ ఏర్పాట్లు, తరగతి గదుల స్థితి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, విద్యార్థుల ఉత్తీర్ణత శాతం, పాఠ్య ప్రణాళిక కార్యక్రమాలు, క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థుల వివరాలు, క్రీడా ఉపాధ్యాయులు, స్కావెంజర్లు తదితర వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేస్తారు.

క్షేత్రస్థాయి పర్యవేక్షణ

- జిల్లాలో ప్రభుత్వ స్కూళ్లు, గురుకులాలు, కేజీబీవీలు 838, ప్రైవేటు స్కూళ్లు 303 ఉన్నాయి.
- పాఠశాలల హెచ్‌ఎంలు నమోదు చేసిన వివరాలు కాంప్లెక్స్ స్కూల్‌కు, ఎంఈవో నుంచి జిల్లా విద్యాశాఖ అధికారి లాగిన్‌కు చేరతాయి.
- నమోదు చేసిన వివరాలను క్షేత్రస్థాయిలో ఉన్నాయా..? లేదా..? అని పరిశీలించేందుకు జిల్లాస్థాయి అధికారిని నియమిస్తారు.
- జిల్లా సెక్టోరియల్ అధికారి నేతృత్వంలో క్షేత్రస్థాయిలో నమోదు చేసిన వివరాలను పరిశీలిస్తారు.
- పరిశీలన అనంతరం జిల్లా నుంచి రాష్ట్ర విద్యాశాఖకు సమాచారం అందించనున్నారు.

వివరాల ఆధారంగా నిధులు



పాఠశాలల్లో స్థితిగతులు, వాస్తవ పరిస్థితులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు యూడైస్ ప్లస్‌లో నమోదు చేస్తున్నారు. తప్పిదాలు జరగకుండా ఉండేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపడుతాం. వివరాలు సరిగా ఉన్న పాఠశాల సమాచారాన్ని ఆన్‌లైన్ ద్వారా రాష్ట్ర విద్యాశాఖకు పంపిస్తాం. యూడైస్ ప్లస్‌లో నమోదైన విద్యార్థుల సంఖ్య ప్రకారం మౌలిక సదుపాయాలు, స్కూల్ గ్రాంట్స్ మంజూరవుతాయి.

– జగన్మోహన్‌రెడ్డి, డీఈవో

సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి



నివాళులు అర్పిస్తున్న నాయకులు

కోరుట్ల: రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో నేటి సమాజం ఉద్యమించాలని సీపీఐ జిల్లా నాయకుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు అన్నారు. 76వ తెలంగాణ సాయుధ పోరాట ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని సి.ప్రభాకర్ స్మారక గ్రంథాలయంలో ఉద్యమ నిర్మాతలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం, దొరలు, పెత్తందారులు, నిజాం నిరంకుశ పాలన అంతం కోసం సాయుధ పోరాటం సాగిందని, ఐదు వేల మంది ఉద్యమకారులు అమరులయ్యారని తెలిపారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం రాష్ట్ర భారత యూనియన్లు విలీనం అయ్యాయని పేర్కొన్నారు. ఈ పోరాటంలో అమరులకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు చెన్న విశ్వనాథం, ఎండీ మౌలానా, రాంబాబు, ఎన్నం రాధ తదితరులు పాల్గొన్నారు.

'మెడికవర్'లో ఓనం వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న వైద్యులు, కేరళ నర్సింగ్ సిబ్బంది

కరీంనగర్‌టౌన్: కేరళను తలపించేలా నిర్వహించిన ఓనం వేడుకలకు శనివారం కరీంనగర్‌లోని మెడికవర్ ఆస్పత్రి వేదికైంది. ఉత్సవాలను వైద్యులు జ్యోతిప్రజ్వలన చేసి, ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు సంక్రాంతి ఎలాగో.. కేరళవాసులకు ఓనం పండుగ అలాగని తెలిపారు. ఆ రాష్ట్రానికి చెందిన యువత నర్సింగ్ విద్యనభ్యసించి, సేవాభావంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నారని పేర్కొన్నారు. మెడికవర్‌లో పని చేస్తున్న సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. మలయాళీల సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే ఓనంను జాతీయ పండుగగా గుర్తించడం శుభపరిణామమన్నారు. అనంతరం ఆస్పత్రి కేరళ సిబ్బంది సంప్రదాయ దుస్తుల్లో ఆటపాటలతో సందడి చేశారు. ఆస్పత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో వైద్యులు కొండపాక కిరణ్‌కుమార్, రామచందర్ తొర్రం, వెంకటేశ్ బోగ, రవి మల్లారెడ్డి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సేవలో మీనా రామనాథన్



వేములవాడ: వేములవాడ రాజన్నను రాష్ట్ర కన్జూమర్ డిస్ప్యూట్స్ రెడ్రెస్సల్ కమిషన్ మెంబర్ మీనా రామనాథన్ శనివారం దర్శించుకున్నారు. కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆమెకు ప్రత్యేక దర్శన అవకాశం కల్పించారు. అనంతరం వేదపండితులు వేదోక్త ఆశీర్వచనం గావించారు. ఆలయ పర్యవేక్షకుడు నర్సయ్య, ప్రొటోకాల్ పర్యవేక్షకుడు అశోక్ ఉన్నారు.

బీర్‌పూర్ మంచినీటి పథకాన్ని పునరుద్ధరించండి

సారంగాపూర్: బీర్‌పూర్ లోని భారీ రక్షిత మంచినీటి పథకం పునరుద్ధరణకు నిధులు పెంచాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శనివారం లేఖ రాశారు. బీర్‌పూర్, ధర్మపురి మండలాలకు తాగునీరు అందించేందుకు గతంలో కాంగ్రెస్ పాలనలో రక్షిత మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేశామని, ఫిల్టర్ బెడ్‌ల ద్వారా తాగునీరు సరఫరా చేశామని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక మిషన్‌భగీరథ పథకాన్ని ప్రారంభించడంతో ఆ పథకం మూలనపడిపోయిందని, మిషన్‌భగీరథ ద్వారా పూర్తిస్థాయిలో తాగునీరు అందడం లేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకొచ్చాక తన సూచనల మేరకు రక్షిత మంచినీటి పథకం పునరుద్ధరణకు ప్రభుత్వం రూ.3.70 కోట్లు మంజూరు చేసిందని, ప్రస్తుతం 5 ఎంఎల్‌డీ రాపిడ్ సాండ్ ఫిల్టర్ స్థాయి నీటిశుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేస్తే ప్రజలకు మరింత వేగంగా శుద్ధజలం అందుతుందని, ఇందుకు రూ.8 కోట్లు అవసరమని ఇంజినీర్లు అంచనా వేశారని, ఆ మేరకు నిధులు పెంచాలని కోరారు.

బూడిద వ్యాన్ బోల్తా



రోడ్డు పక్కన బోల్తా పడిన వ్యాన్

చందుర్తి(వేములవాడ): బూడిద లోడ్‌తో వెళ్తున్న ఓ వ్యాన్ బోల్తా పడింది. స్థానికుల కథనం ప్రకారం.. చందుర్తి మండలంలోని బండపల్లి నుంచి శనివారం సాయంత్రం ఓ వ్యాన్ బూడిద లోడ్‌తో వెళ్తోంది. ఆ సమయంలో ఎదురుగా ట్రాక్టర్ రావడంతో డ్రైవర్ వ్యాన్‌ను రోడ్డు కిందకు దించాడు. దీంతో అది బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికీ ఏం కాలేదని గ్రామస్తులు తెలిపారు. వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజీపేట నుంచి చందుర్తి మండలంలోని ఎన్గల్, బండపల్లి మీదుగా కోనరావుపేట మండలంలోని బావుసాయిపేట వరకు తారు రోడ్డు వేశారన్నారు. రెండేళ్లు గడుస్తున్నా దారికిరువైపులా మట్టి పోయడం లేదని పేర్కొన్నారు. భారీ వాహనాలు వచ్చి, రోడ్డు దిగితే బోల్తా పడుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి, మట్టి పోయించాలని కోరుతున్నారు.

కారు పార్కింగ్ విషయంలో గొడవ

సిరిసిల్ల క్రైం: సిరిసిల్లలోని ఓ షాపు ఎదుట కారు పార్కింగ్ విషయంలో గొడవతో ఓ అడ్వకేట్‌పై కేసు నమోదైంది. టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. రాజీవ్‌నగర్‌కు చెందిన అడ్వకేట్ కైలాష్ తన కారును పట్టణంలోని మిట్టపల్లి శ్రీనివాస్–రాజేశ్వరి దుస్తుల షాపు ఎదుట నిలిపారు. కారు తీయాలని చెప్పడంతో గొడవ జరిగింది. కైలాష్ తనను దుర్భాషలాడాడని, చంపేస్తానని బెదిరించాడని రాజేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఆయనపై కేసు నమోదు చేసినట్లు వారు పేర్కొన్నారు.

ఆన్‌లైన్ పెట్టుబడులపై విచారణ

- ఆందోళన చెందుతున్న వ్యాపారులు
- 'సాక్షి' కథనంతో పెట్టుబడిదారుల వెనుకంజ



'సాక్షి'లో ప్రచురితమైన 'చేరండి.. చేర్పించండి' కథనం

జగిత్యాలక్రైం: ఆన్‌లైన్ యాప్‌లో పెట్టుబడి పెడితే అధిక వడ్డీ చెల్లిస్తూ పలు యాప్ కంపెనీలు జిల్లాలో సుమారు రూ.వెయ్యి కోట్ల మేర ఆహ్వానించాయి. ఇలాంటి యాప్‌లు గతనెల రెండు నుంచి మూడు యాప్‌లు మూతపడ్డాయి. జిల్లాలో జోరుగా కొనసాగిన మరో యాప్ నాలుగు రోజుల క్రితం మూతపడటంతో జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి శుక్రవారం ఎస్పీ అశోక్‌కుమార్‌కు ఆన్‌లైన్ యాప్ పెట్టుబడులపై ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారణ ప్రారంభించారు. సాంకేతిక పరిజ్ఞానంతో యాప్‌ను తెరిచి పెట్టుబడులు పెట్టించుకున్నారని గుర్తించారు. కొద్దికాలంగా కొన్ని యాప్‌లు మూసివేయడం.. కొన్ని యాప్‌లలో మార్పులు చేసి తక్కువ డబ్బులు చెల్లిస్తుండటంతో పెట్టుబడిదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో జూన్ 21న 'సాక్షి' 'చేరండి.. చేర్పించండి' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. ఇది ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో చాలామంది పెట్టుబడిదారులు యాప్‌ల్లో మోసపోయినట్లు వాట్సాప్‌లో పోస్టులు పెడుతున్నారు.

ఫేక్‌కాల్స్‌తో జాగ్రత్త..!

పెగడపల్లి: 'మీ కొడుకు, మీ కూతురు గంజాయి కేసులో పట్టుబడ్డారు. రూ.50 వేలు ఇస్తే కేసు మాఫీ చేస్తాం..' అంటూ ఫేక్‌కాల్స్ వస్తున్నాయని, ఇలాంటి కాల్స్ నమ్మొద్దని ఎస్సై రవికిరణ్ పేర్కొన్నారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతోంది. మరో గ్రామానికి చెందిన ఓ యువకుడు హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. శుక్రవారం రాత్రి వారి తల్లిదండ్రులకు ఓ వ్యక్తి ఫోన్ చేసి ‹మీ కొడుకు, మీ కూతురు గంజాయి కేసులో పట్టుబడ్డాడు. వారిని పోలీసులు అరెస్ట్ చేశారని పోలీస్ డీపీ ఫొటోతో ఉన్న ఫేక్ కాల్ వచ్చింది. వారిని కేసు నుంచి తప్పించాలంటే రూ.50 వేలు ఇవ్వాలని సూచించారు. అనుమానం వచ్చిన వారి తండ్రులు కాసేపటి తర్వాత డబ్బులు పంపిస్తామని, అడ్రస్ చెప్పాలన్నారు. వెంటనే వారివారి పిల్లలకు ఫోన్ చేసి మాట్లాడారు. తాము సురక్షితంగా ఉన్నామని చెప్పడంతో ఫేక్ కాల్ అని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. అలాగే మండలకేంద్రంలోని ఓ వ్యాపారికి ఓ ఆగంతకుడు ఫోన్ చేసి తన దుకాణం ద్వారా గ్రామ పంచాయతీకి పన్ను చెల్లించడం లేదని, రూ.10 వేలు పంపించాలని డిమాండ్ చేశాడు. నమ్మిన సదరు దుకాణ యజమాని రూ.10 వేలు ఫోన్ పే ద్వారా పంపించాడు. తరువాత మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. ఇలాంటి ఫోన్‌కాల్స్ చాలామందికి వస్తున్నాయి. కొందరు బయటకు చెబుతుండగా.. మరికొందరు చెప్పుకోలేకపోతున్నారు. ఈ విషయమై ఎస్సైని సంప్రదించగా కొద్దిరోజులుగా ఫేక్ కాల్స్ వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వాటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాట్సాప్ ద్వారా వస్తున్న లింక్‌లను ఓపెన్ చేయొద్దన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు ఇవ్వండి

- అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి



వాకర్స్‌తో మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం ఉదయం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్స్‌ను కలిశారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పలు విద్యాసంస్థల యజమానులు, సేవా సంస్థల నిర్వాహకులు, యువజన సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి..

హుజూరాబాద్: ప్రజాసేవ కోసమే తాను రాజకీయాల్లోకి వస్తున్నానని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి తెలిపారు. శనివారం హుజూరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓటర్ల ఎన్‌రోల్ కార్యక్రమం ప్రారంభించామని, డిగ్రీ పూర్తి చేసి, మూడేళ్లు గడిచిన పట్టభద్రులందరూ ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సుమారు 20 లక్షల మంది పట్టభద్రుల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన జాబ్ క్యాలెండర్‌ను చూసి ఆకర్షితుడినై, కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నానని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ డీఏ చెల్లించేలా చూస్తానని, ప్రైవేట్ ఉద్యోగులకు 12 నెలల జీతం ఇచ్చేలా యాజమాన్యాలతో చర్చిస్తానన్నారు. ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు ఇచ్చేలా ముఖ్యమంత్రితో మాట్లాడతానని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల భూములు కబ్జాకు గురయ్యాయని, తనను గెలిపిస్తే హైడ్రా తరహాలో చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.